# తీర్పు

శివ్వాల సత్తిగాడు సింగన్నపాలెం చివరవీధిలో నున్న చివరగా నున్న యింట్లో అయ్యా అమ్మా అప్పా చెల్లీ అటూ యిటూ ఎవరూ లేకుండా బొక్కీసుగా ఉంటున్నాడు.

ఇల్లు కారుతున్నా, గోడలకు పెద్ద పెద్ద పెచ్చులూడి పడి పోయినా, ముందల తలుపుమీద చివర అడుగున్నరముక్క ఊడిపోయి పిల్లులు దూరిపోయి దాచుకున్న గెంజీ అంబలీ ముట్టీసినా, వెనక తలుపు బదులుగా తాతలనాటి తడక కట్టబడిఉన్నా; రెండేరెండు గావంచాలు, మూడంటే మూడు చిరిగిన బాడీలతో బాధపడుతున్నా శివ్వాల సత్తిగాడు కంబారిగా కుదరడానికి ఒప్పుకున్నాడుకాదు.

"నాను కంబారిపని సెయ్యనుగాక సెయ్యను." అని ఎప్పుడో నిశ్చయించుకున్నాడు.

ఎత్తుగా బలంగా నల్లగా సేవదేరిన ఇరిడిముక్కలాగ కనబడు తున్న శివ్వాల సత్తిగాడ్ని చాలామంది భూకామందులు చాలా ఆశలు చూపించి కంబారిగా కుదుర్చుకోడానికి ప్రయత్నం చేసేరు. పాపి నాయుడు నాలుగైదుసార్లు సత్తిగాడ్ని పిలిచి

"ఒరే శివ్వాలోడా! కంబారితనానికి మందగ్గిర కుదురుకుంటా వేట్రా?" అని అడిగేడు.

సత్తిగాడు నాలుగైదుసార్లుకూడా

"నాకెవులున్నారు బావూ తిండానికి! ఈ ఒక్కడుపుకి కంబారితన వేంల?" అనీసి వెళిపోయేడు.

పాపినాయుడుమాత్రం విరాశపడి ప్రయత్నాన్ని విరమించుకో లేదు. ఒకకన్ను శివాల సత్తిగాడి మీద వేసే వుంచేడు.

సత్తిగాడు కంబారిపని చెయ్యకపోయినా చాలా పన్లు చేస్తుండే వాడు.

బ్లాకువాళ్ళు రోడ్డేయించినా చెరువులు బాగుచేయించినా మట్టి పని బంటాల్లెక్కన చేసేవాడు. దమ్ములప్పుడు పారపనికీ, ఉడుపులప్పుడు అకుదీతకీ, కోతలప్పుడు చేను కోతకూ; రోజుకూలికి వొప్పుకొని వెళ్ళేవాడు

అంతేగాకుండా ఒక్కడే నలుగురు మనుషులపాటి పని జెయ్యడం వల్లనూ, పనిలో మాయా మర్మం లేకుండా వంచిన నడుం ఎత్తకుండా కష్టపడ్డంచేతనూ ఆ పల్లెలో కొత్తగా ఎవరు ఇల్లు కట్టుకున్నా పూరింటి కప్పు నేయించుకున్నా పెరడుకు దడి పెట్టించాలనుకున్నా శివ్వాల సత్తి గాడిని పిలిచి తీరవలసిందే!

అన్ని పనుల్లోనూ అరిందాలాంటి సత్తిగాడికి అన్ని కాలాల్లోనూ ఏదో ఒక పని దొరుకుతూ వుండేది. పని దొరికినప్పటికీ పొట్టనిండా మూడుపూటల తిండికి మాత్రం ఎప్పుడూ కటకటగానే వుండేది.

అయినప్పటికీ సత్తిగాడి నిశ్చయంలో ఏమాత్రమూ మార్పు రాలేదు! కూలీగానేవున్నాడు తప్పితే ఎక్కడా కంబారిగా కుదురుకో లేదు!

సింగన్నపాలేనికి పంచాయితీ ఎన్నికలు చాలా దగ్గరగా వచ్చేయి!

పాత ప్రెశిడెంటుని దించేసి కొత్త ప్రెశిడెంటును ఎక్కించాలని సమితి ప్రెశిడెంటు చాలా తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు సమితి ప్రెశి డెంటు భవిష్యత్తు సింగన్నపాలెం ఎన్నికమీదనే ఆధారపడివుంది.

సమితిలో పాతిక పంచాయితీలున్నాయి. పన్నెండు పంచాయితీ లకు కాపులు ప్రెశిడెంట్లుగా వుంటే పన్నెండు పంచాయితీలకి కొప్పుల వెలమలు ప్రెశిడెంట్లుగా వున్నారు! ఒక్క సింగన్నపాలెం ప్రెశిడెంటు మాత్రం కాపూ కొప్పులవెలమా గాక కరణం కులానికి చెందినవాడు! అతడి ఓటు ఎటుపడితే అదే మెజారిటీ అయిపోయి ఆ వర్గంవాడే సమితి ప్రెశిడెంటయి కూర్చుంటాడు. ఆ కారణంగా సింగన్నపాలెం పంచాయితీ

ఎన్నికకి అంత ప్రాధాన్యతనిచ్చి సమితి ప్రెశిడెంటు చాలా తీవ్రంగా కృషి చేస్తున్నాడు. కాపు కులంవాడు ఊ౯కి ప్రెశిడెంటు కావాలని పాతాళ యజ్ఞం ప్రారంభించేడు.

ఆ యజ్ఞంలో మొట్టమొదటి ప్రయత్నంగా ఆ ఊరికి కరంటు వేయించేడు।

దానికతడు చాలా శ్రమపడ్డాడు. చాలామందిని ఆశ్రయించేడు. పెద్దవాళ్ళదగ్గరకు పోయి

"పాత ప్రెశిడెంటు అపొజిషన్ గ్రూపువాడనీ డబ్బు తీసుకొని కూడా ఓటెయ్యకుండా రెండుసార్లు మోసం జేస్నేడనీ; అలాంటివాడివల్ల మన గ్రూపుకి దెబ్బ వుందనీ చెప్పేడు। అంతేగాకుండా అతగాడ్ని తక్షణం దించీయాలంటే ఎన్నికలకు ముందుగానే ఆ వూరివారి చిరకాల కోరిక నెరవేర్చాలనీ, ఆ కోరిక నెరవేరినట్టు వాళ్ళంతా గు ర్తించి మనని నమ్మినట్టు చెయ్యాలంటే తక్షణం ఆ వూళ్ళోని వీధుల్లో ఎలక్ట్రిక్ లైట్లు వెలిగించాలనీ నచ్చజెప్పి కొంత డబ్బు చేతిదికూడా ఖర్చుపెట్టి కరంటు తెప్పించి దీపాలు వెలిగించేడు.

సింగన్నపాలేనికి కరంటు వచ్చీసింది।

వీధుల్లోని స్తంభాలకు లైట్లు వేలబడి వెలిగేయి।।

పూర్వం వీధుల్లో కిరసనాయిలు దీపాలుకూడా లేకపోవడంచేత ఆ ఊళ్ళో ముగ్గుర్కి పాములు కరిచేయి। అందులో ఇద్దరు తక్కువ చచ్చిపోయేరు. ఒకడికిమాత్రం వొళ్ళంతా మచ్చలు దేలిపోయి ఏ పనికీ పనికిరాకుండా పోయేడు।

అంచేత చీకటి రాత్రులలో ఆ ఊరివాళ్ళు పాముల భయానికి వీధుల్లో అంతగా తిరిగేవారుకాదు. అలాంటిది ఒక్కసారిగా ఎలక్ట్రిక్ బల్బులు వెలిగి రాత్రుళ్ళు ఊరువారంతా పట్టపగల్లా పున్నమినాటి రాత్రిలా అయిపోవడంతో ఆ ఊర్లోని ఆబాలగోపాలం ఆనందం పట్టలేక లైట్ల వెలుతుర్లో చిందులుతొక్కేరు।

ఆ ఆనందంలో పాత ప్రశిడెంటుని దించీసి, కొత్త ప్రశిడెంటుని ఎన్నిక చేసుకొని సమితి ప్రశిడెంటుకి హాయినీ ఆత్మకు శాంతినీ చేకూర్చేరు!

అలా వచ్చిన కరంటుతీగల క్రింద ఒకనాడు శివ్వాల సత్తిగాడూ రాగాల గున్నిగాడూ గురవయ్యగారి పొలంలో పారపని చేస్తున్నారు. వాళ్ళు పనిజేస్తున్న మడికి రెండు మళ్ళు దాటించి గట్టుపక్కనే ఎలక్ట్రిక్ స్తంభం వుంది. అక్కడ రాగాల గున్నిగాడూ శివ్వాల సత్తిగాడూ బట్టలువిప్పి వుంచేరు. గిడుగులు స్తంభానికి చేంవేసి పొగచుట్టలు తడవకుండా దాచుకున్నారు.

చిన్నగా సన్నగా చినుకులు పడుతున్నాయి. మబ్బులుమాత్రం ఆకాశంమీద దట్టంగా అలుముకొనివున్నాయి. దమ్ముచేసి, నొల్లతోలీసిన మళ్ళల్లో తెల్లటి కొంగలూ నల్లటి కాకులూ కలిసి కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నట్టున్నాయి. ఊడుస్తున్న మళ్ళలోంచి ఆడవాళ్ళ పాటలూ నోటితో పోస్తున్న "వులవలు" విచిత్రంగా వినిపిస్తున్నాయి!

ఊర్లో నిశ్శబ్దంగానూ పొలాల్లో హడావుడిగానూ వుంది!

రెండు మళ్ళు పారపని జేస్సి మూడోమడి గట్టుమీద ఎలక్ట్రిక్ స్తంభం పక్కన నిలబడ్డారు శివ్వాల సత్తిగాడూ, రాగాల గున్నిగాడూ! ఇద్దరి శరీరాలు చెమటతోనూ తుంపరగా పడుతున్న చినుకులతోనూ తడిసిపోయి; కడిగిన తరవాత తుడవకుండా నిలబెట్టిన ఇనప విగ్రహాల్లా కనబడుతున్నాయి!

సత్తిగాడు గిడుగుకింద దాచిన చుట్టతీసి గడ్డిబెంటుకున్న అగ్గిమీద పెట్టి బుక్కళ్ళుతీస్తూ రెండు దమ్ములాగి అలుపు తీర్చుకుంటున్నాడు. రాగాల గున్నిగాడు మాత్రం జాపోసిపోతూ చెమటతోపాటుగా నోట్లోకి వస్తున్న బురదను తుపుక్కుమని ఉమ్ముతున్నాడు.

"ఏంరోయ్! గున్నిగా! ఏటలా జాపోసిపోతన్నావు? మా ఎంకటొదినగాని ఇప్పుడు సూత్తే నీ పసింతేనని పరాసికాలాడగల్దు!" వికటం ఆడేడు సత్తిగాడు.

దానికి గున్నిగాడుకూడా

"జొన్నేరా! ఆంజనేయసామినాగ పెళ్లీ పెటాకుల్లేకుండా వున్నావు! రెండేలు పెళ్ళాంతోటి కాపరంసెయ్యిరా! ఒకమడికి పార పని సేసీసరికి ముసిలిపోతులాగ సొంగలు ఎలా కక్కేవో నానూ సూత్తాను." అన్నాడు

అందుకు గర్వంగా

"ఓరెల్లురా! ఎవుడ్దగ్గిర కోత్తావు? ముగ్గురాడోంతోటి మూడేల్లు కాపరం జేస్సినా నాకసలు అలుపురాదొసే!" అన్నాడు సత్తిగాడు.

"ముగ్గుర్రేలా! ఒక్కదాన్తోటి వెగ్గురా! అచ్చోసిన అంబోతు నాగున్నావు. మూడేలాయి ఎంటపడతందిగదా ఆ పొట్టి సరస! దాన్నొక్కపాలన్నా సూసీవురా! అది కనబడీసరికి తోకముడిసీసి జారిపోతావు. అదుష్టమంతుడువిగాబట్టి అది విన్నొదలకుండా ఆశ పెట్టుకునుంది. నాదగ్గిట కొయ్యేకరారే!" అన్నాడు గున్నిగాడు.

శివ్వాల సత్తిగాడు ఉడుక్కున్నాడు.

"ఒరోరె ఆడారి గున్నిగా! దానూసు నాదగ్గినెత్తకుమల్లా! కనబడితేసావ; మరొగ్గదు. బజీవిక బంకనాగ తగులుకుంటాది. పూట తిండికి నాకే టికాణా లేదోరె! దానికేపెడతన్రా?" అన్నాడు.

గున్నిగాడు సత్తిగాడు ఉడుక్కోవడం చూసి ముసిముసినవ్వులు నవ్వుకున్నాడు. తరువాత

"దానికేపెడతావో నాకెందుగ్గాని; అటు సూడు. గురవయ్య బుగత ఇటుకాసే వొస్తుండు. ఊసులాడుకోని పనెగ్గొడతన్నావని తిట్టగల్డు." హెచ్చరించేడు.

మొదటే ఉడుక్కొని కోపంగావున్న సత్తిగాడికి రెండు పొరత్తీసి జాపోసిపోయిన గున్నిగాడు పని పురమాయించీసరికి మరీ కోపంగా

"ఏట్రోయ్? నాకు పని పురమాయించీపాటివోడివై పోనావేటి? మూడు బారల మడిగట్టుకి మూడ పెక్కులు కొట్టేవో నేదో అలాగ

కొలు సాపీసేవు! అస్సి! నాకు చెప్పొచ్చేవురారే! దిగొస్సి! గురవయ్యా బుగతే సూత్తాడు ఎవుడి పనెంతపాటిదో?" అని పారపట్టుకొని మడిలోకి దిగేడు.

పురుగుని తీసిపారేసినట్టు తీసేసి శివ్వాల సత్తిగాడు మరీ అంత నిసాకారంగా మాట్లాడీసరికి రాగాల గున్నిగాడిక్కూడా కాస్త కోపం నిజంగానే వచ్చింది.

"ఆగొరే! అక్కడే నిలబడు! ఏటి పేల్తన్నావు. వొలం గున్నోడికల్లా పాఁవుమంత్రం రాదుమీ! సూస్నిన్రా! నీలాంటి వాఁటి పోత్తరంగాళ్ళని సానామందిని జూస్సేను. అంత పోత్రంగుంటె అదుగోరా! ఎలట్రీ స్తంబం! ఎక్కి ఆ తీగిలు పట్టుకొమ్మిరా! నీ బలఁవెంతపాటిదో నిమసాలమీద తేలిపోద్ది!" అన్నాడు.

అదే సమయానికి పక్కపొలంలో గుత్తకు పనిజేస్తున్న ఉడుపుల వాళ్ళకు చల్దన్నాలు తట్టలో పెట్టుకొని పొట్టిసరస గట్టుమీదనుండి పోతూ

"ఏటోరె గున్నయమాఁవా? పందేలేస్తన్నావు! సత్తిం బావ తోటి పందిం వొద్దురొరే! ఆడిది ఏనుగుబలం. నిన్నొత్తి కుదేసీగల్డు!" అని గలగలా నవ్వింది.

గున్నిగాడికి సరస ఎగతాళితో పౌరుషం నెత్తికెక్కిపోయి కూచుంది.

"ఆ కుదీసీడవేఁదో నీకేత్తాడుగానీ నాకెందు కేత్తాదే పొట్టిగుంటా! తోవెంట తిన్నగెల్లుమల్ల!" అని సరసను వెళ్ళమన్నాడు.

సరస ససేమిరా కదలనంది. నెత్తినున్న గంప కిందకిదించి

"మీ పందివెఁటో సూడకుండా నేనెల్తానేటి?" అంది.

"ఐతే సూడే! సత్తిగాడిది ఏనుగు బలఁవన్నావుగదా? ఆ ఎలట్రీ తంబం ఎక్కేసి తీగిపట్టి దిగిపొమ్మనే!" అని అంటుండగా

గున్నిగాడు మాట పూర్తికాకుండానే సత్తిగాడు గబగబా "అయితే సూడ్రా! తీగట్టుకుంటాను." అని నాలుగంగల్లో స్తంభం

ఎక్కి తీగలకు మూరడు దూరంలో చెయ్యెత్తి తీగను పట్టుకోబోయేసరికి ఏదో ఒక అపూర్వ బలసంపన్నమైన శక్తి విసిరి పారేసినట్టు దబ్బున నేలపడిపోయి తన్నుకోవడం రెప్పవేసి చూసినంత లోపల జరిగి పోయింది.

గట్టుమీద నుండి చూస్తున్న పొట్టి సరస

"ఓర్నాయినో ! సత్తింబావ సచ్చిపోనాడోరి నాయినో !" అని గోలపెడుతూ సత్తిగాడి దగ్గరికి పరిగెత్తింది.

విభ్రాంతపోయి చూస్తున్న గున్నయ్యా కూడా పరిగెత్తేడు. దూరంగా ఉన్న గురవయ్య బుగత కూడా పరిగెత్తుకు వచ్చేడు. పొలం పన్లు చేసుకుంటున్న చుట్టుపక్కల వాళ్ళంతా పరుగెత్తుకు వచ్చేరు.

అప్పుడు అలాగ పందెంవేసి పంతంకోసం అవిధంగా పడిపోయిన శివ్వాల సత్తిగాడు అలాగే మంచంమీద మూడుమాసాలు పడిపోయి మూడొందల రూపాయలు పాపినాయుడికి అప్పుపడిపోయి పొట్టిసరస సాయంతో మంచంమీదనుండి లేచేడు.

లేచింతరవాత శివ్వాల సత్తిగాడ్ని ఊళ్ళోవాళ్ళెవరుకూడా సత్తిగాడని పిలవడం మానేశారు. కరంటుషాకుతిని చచ్చినంత కలగాసేడు గాబట్టి "కరంటుగాడ"న్న పేరును స్థిరపరిచేసేరు. సత్తిగాడుకూడా కరంటుగాడని పిలిచేసరికి సరదాగా నవ్వేసేవాడు. అంచేత అందరూ కరంటంటే కరంటూ అని మొదట్లో కలకలా కిలకిలా నవ్వేవారు. అల వాటుగా మారిపోయిన తరువాత నవ్వడం మానేసేరుగానీ కరంటుగాడని పిలవడంమాత్రం మానలేదు.

కరంటుగాడు కరంటుషాకునుండైతే తేరుకున్నాడుగానీ పాపి నాయుడి తాలూకా మూడొందల అప్పునుండి మాత్రం తేరుకోలేక పోయేడు. అప్పు తీర్చేయాలని ఆరుమాసాలు కష్టపడి పనిజేసి ప్రయత్నం చేసినా అర్ధరూపాయికూడా తీర్చలేకపోయేడు. మరందుచేత అప్పుతీరే మార్గంలేక హామీగా వుంచడానికి అంతపాటి విలువచేసే వస్తువులేక పాపినాయుడి ముఖంముందర కంబారీతనం చెయ్యాలని మునపటిలా కంది

తంగా చెప్పడానికి మూడొందల రూపాయల మొగమాటం వుండడంచేత, చివరికి చేయవలసింది మరేమీలేక కరంటుగాడు కంబారిగా కుదిరి పోయేడు.

పాపినాయుడు హాయిగా గర్వంగా నవ్వేడు. కరంటుగాడ్ని కంబారిగా పట్టగలిగినందుకు చేపను పట్టుకొన్న కొంగలాగ, ఈగను పట్టిన సాలెపురుగులాగ, లేడిని పట్టుకొన్న పులిలాగ, కప్పను పట్టుకొన్న పాములాగ, ఎలకను పట్టుకొన్న పిల్లిలాగ నవ్వేడు. సాటి భూకామందులు ఈర్ష్యపడినంత గర్వంగాకూడా నవ్వేడు. పాపినాయుడి అదృష్టానికి ఈర్ష్యపడిన కామందులు వాళ్ళ కంబార్ల ముందర "ఏర్రా! మీరూ వున్నారు ఎందుకు! పీసమెత్తుపని చేతకాదు సరిగదా కళ్ళంలో పడు కొండ్రా అని చెబితే బుగతల కళ్ళుమూస్సి పెళ్ళం పక్కాల జేరిపోతారు! పాపినాయుడి అదృష్టవేఁ అదృష్టం. కలిసొస్తే అలాగ కలిసిరావాల. అంచేతనే పెద్దలనీసిపోనారు. కలిసొచ్చిన్నాడు నడిచొచ్చిన కొడుకులు పుడతారని." అన్నారు.

పాపినాయుడు విన్నాడు. విని తనయొక్క తెలివితేటలను తలుచుకొని తలుచుకొని మురిసిపోయేడు.

వెనకాముందూ ఎవరూ లేరని సాయానికనివచ్చి జబ్బులో సేవ జేసిన పొట్టిసరస కరంటుగాడికి వెనకా ముందూ తానే అయిపోయి అక్కడే వుండిపోతానంది.

అలాగ సరస అనేసరికి కరంటుగాడు పూర్వంలాగ కసిరేకుండా కాస్త మెత్తబడి

"అప్పిడే ఎలాగే! పాపినాయుడి దగ్గిట కంబారితనం సేత్త న్నాను గదా! సాలజీతం రానీ! సర్దాగా కలిసుందుం." అన్నాడు.

సరస "సరే"నంది.

పాపినాయుడికి పాతిక ఎకరం మెట్టూ పాతిక ఎకరం పల్లం వుంది. రెండుజతల పోతులూ మూడుజతల ఎడ్లూ వున్నాయి. కరంటు గాడితో కలిపితే ముగ్గురు కంబార్లున్నారు.

నాలుగ్గదుల డాబాకి వెగ్గా అరెకరా పెరడూ; పొడవుగా గెడ కర్రలాగున్న ఒకే ఒక్కడైన కొడుక్కీ బలంగా చింతపిక్కలా కన బడుతున్న కోడలూ; ఎల్లప్పుడూ మంచాన పడివున్న పెళ్ళానికి ఏ విషయమూ పదలని దగ్గూ, రెండు బీరువాలూ, రెండొందల తులాల బంగారమూ, లెక్కలేనంత రొక్కమూ వుంది.

కొడుకు నిత్యం వ్యవసాయం పనుల్లో మునిగి తేలుతుంటాడు. పాపినాయుడు కోడలు జేస్తున్న సేవలవలన లభిస్తున్న ఆనందంలోనూ గ్రామంలోని వ్యవహారాల్లోనూ మునిగి తేలుతుంటాడు.

అలాగ మునిగితేలుతున్న పాపినాయుడి దగ్గర కరంటుగాడు కంబారిగా మునిగిపోయేడుకానీ మరి తేలలేదు. మూడొందల అప్పుకూడా తీరలేదు।

రోజులు గడిచేయి. మాసాలు దొర్లిపోయేయి. పాపినాయుడు కరంటుగాడ్ని మిగతా కంబార్లకంటా మంచోడనీ, గొప్పోడనీ పొగడ్డం చేతను ! మిగతావాళ్ళందరికంటే ఎక్కువపని కరంటుగాడు చెయ్యవలసి వచ్చేది. రాత్రి చాలా పొద్దుపోయిం తరువాత "వెళ్ళరా కరంటూ।" అని బుగత వెళ్ళమన్న తరువాత ఇంటికి వెళ్ళవలసి వచ్చేది.

ఎండలు మండిపోతున్నాయి. పొలాలో వ్యవసాయాల్లేకపోవడం చేత కంబార్లకు పనులంతగాలేవు. అందుచేత కరంటుగాడు పాతాళానికి పోయిన నూతిలోని నీరుతోడి ఇంటికి సరిపడినంత తేవడం, స్నానాలకు నీళ్ళుపెట్టడం, తడిసిన బట్టలు పిండి ఆరవెయ్యడం మొదలైన ఇంటి పన్లు చూస్తూ తోటి కంబార్లు పశువులకు కుడితిలు పెడుతున్నారో లేదో చూసి అజమాయిషీ చేస్తుండేవాడు.

కరంటుగాడు కష్టపడి తెస్తున్న నీటిని పాపినాయుడి ఇంట్లోవాళ్ళు సునాయాసంగా వాడి పారబోస్సేవాళ్ళు. పాపినాయుడి పెళ్ళాన్ని మినహాయిస్తే మిగతావాళ్ళంతా రోజుకు రెండుసార్లు స్నానం చేసేవారు. ఒక్కొక్కరూ మూడేసి నాలుగేసి కుండల నీళ్ళు పోసీసుకుండేవారు. అందుకు కరంటుగాడు అప్పుడప్పుడూ మనసులో బాధపడేవాడు।

ఆవేళ ఉదయం పాపినాయుడు కోడలు నాలుగుకుండల నీళ్ళ స్నానం చేస్పింది. మళ్ళీ సాయంకాలం పశువులకు కుడితి కలుపుతున్న కరంటుగాడితో

"ఒరే కరంటూ! మాంగారూ వాళ్ళూ స్తానాలు జేస్పేరు. ఇంట్లో నీటిబొట్టులేదు. స్తానం చేస్తాను. కావిడి నీళ్ళ తీసుకురారా!" అంది.

అప్పటికే పొద్దు మునిగిపోయింది. కుడితి కలిపేసి ఇంటికి వెళ్ళి పోవాలనుకుంటున్న కరంటుగాడు చిరాకుపడుతూ

"పొద్దుటేగదమ్మా! అన్ని నీలు పోసుకున్నావు" అని మూలిగి కుడితి కలపడం ఆపేసి కావిడి భుజంమీద వేసుకొని కళ్ళంలోవున్న నూతికి బయలుదేరేడు.

కావిడి భుజాన వేసుకొని వెళ్తున్న కరంటుగాడ్ని చూస్తూ పాపి నాయుడు కోడలు ముసిముసినవ్వులు నవ్వుతుంది. స్నానాల గదిలోకి వెళ్ళి జాకెట్టు తీస్పి "అబ్బా! ఎంత వుక్కగావుంది." అని తనలో అనుకుంటూ చీర విప్పేసి గోడనున్న మేకుమీద ఉంచింది. చెమట కాయలు పుట్టేయేమోనని గుండెల్ని ఒక్కసారి చూసుకుంది. మసక చీకట్లో చెమటకాయలు కనబడలేదుగానీ ఎత్తుగా బలంగానున్న గుండెలు నగ్నంగా కనబడ్డాయి. మరొకసారి గర్వంగా ముసిముసినవ్వు నవ్వింది. నవ్వుకోవడం పూర్తికాకుండానే కరంటుగాడు కావిడినీళ్ళతో స్నానాల గది తలుపు తోసుకొని లోనికి ప్రవేశించేడు. బైట తగుమాత్రంగా వున్న వెలుతురుకూడా కరంటుగాడితోసహా గదిలోకి ప్రవేశించింది! వెలుతురులో నాయుడు కోడల్ని చూసి విభ్రాంతపోయేడు!!

పాపినాయుడి కోడలుకూడా కరంటుగాడ్ని చూసి మొదట విభ్రాంతపోయి, నిముషంలో తేరుకొని మూడోసారి ముచ్చటగా ముసి ముసి నవ్వులు నవ్వుతూ

"ఏంరా కరంటూ! బీపి తోముతావురా?" అని చెయ్యిపట్టుకు లాగింది.

కరంటుగాడు రెండోసారి కరంటుషాకు తిన్నట్టుగా అయిపోయేడు. అంతవరకూ వాడి జీవితంలో అలాంటి సంఘటన ఎప్పుడూ తటస్థపడ లేదు. పొట్టిపరన చాలాసార్లు పరసాలాడిందిగానీ ఇలాగ ఇంత సిగ్గు లేకుండా దిసమొలతో మగాడిముందు నిలబడి నవ్వుతూ పిలవడం కరంటుగాడు ఎప్పుడూ చూడలేదు సరిగదా విన్లేదుకూడా! అంచేత గాభరాగా

"తప్పమ్మగోరూ!" అని చెయ్యి విడిపించుకొని గదినుండి బైట పడి వేగంగా కొట్టుకుంటున్న గుండెలకంటే వేగంగా నడుస్తూ ఇంటికి చేరేడు.

కరంటుగాడు ఇంటికివెళ్ళి ఉట్టిమీద వుంచుకున్న గెంజిదాక దించు కున్నాడు. సత్తుగిన్నెలో గెంజివొంపి అడుగునున్న మెతుకులు దేవి గిన్నెలో వేసుకున్నాడు. ఉప్పుబుట్ట తీసి కొంచెం ఉప్పేసుకొని అందులో వున్న మిరపకాయతీసి ఒకముక్క కొరికేడు. గూబ గుయ్యిమంది. మంట తగ్గడానికి బుక్కెడు గంజితాగి మెతుకులు దేవి నోట్లో పెట్టు కున్నాడు. ముద్ద మింగుడుపడకుండా వుంది. మనసు తేలిపోతున్నట్టుగా అదోకలాగ అయిపోతుంది. ఉండుండి గుండె కొట్టుకుంటుంది. అదేమిటో అర్థంగాక గెంజి ముందునుంచి లేచిపోయి, వీధిలోకివెళ్ళి "దూ! దూ!" అని కుక్కని పిల్చి గిన్నెతోటి పెట్టేసేడు. వట్టిట్లో చిరిగిన గోనెలమీద మాసిపోయిన పచ్చడం పడేసి తిన్నగా పడుకొని కళ్ళు మూసుకున్నాడు.

అయినా వాడికి పాపినాయుడు కోడలు కొట్టించిన షాకు వదల్లేదు! కళ్ళముందర నగ్నంగా నవ్వుతూ "ఒరే కరంటూ! బీపి తోముతావురా?!" అని పిలుస్తున్నట్టుగానే కనిపిస్తుంది.

కళ్ళు గట్టిగా మూసుకొని బొమ్మళ్ళా పడుకొని కాలు విగడ దన్నేడు. మనసుని గట్టిగా మరో విషయంమీదకి మళ్ళించాలని ప్రయ త్నించేడు.

మొన్న మధ్యాహ్నం ఎదురింటి అవుల సూరయ్యా పిల్చి చెప్పిన మాటల్ని జ్ఞాపకం చేసుకొనేందుకు ప్రయత్నం చేసేడు.

"ఓరే! కరంటూ!" అని పిల్చి "సంగంల సేరతావేట్రా?" అని అడిగేడు సూరయ్య.

"సంగం" అన్న మాట వినేసరికి తుళ్ళిపడ్డాడు కరంటుగాడు. తరువాత విపరీతంగా భయపడ్డాడు. సూరయ్యవైపు ఆశ్చర్యంగా చూసేడు. ఏదో ఒకటి అనాలిగాబట్టి భయాన్ని దాచుకుంటూ

"కంబార్లకి సంగఁవేటి సూరయమాఁవా! మనవల్లేటవుద్ది?" అని చప్పరించేడు.

అందుకు ఆవుల సూరయ్య నవ్వుతూ

"ఓరే! అల్లుడూ! ఏటవుతాదని పల్లకుంటే ఏటీ అవదురా! పాతిక ఎకరం బూఁవి ఎంతోటో నీకు తెలుసునుగదురా? అంతోటి మీ బుగత బూఁవి నువ్వు దున్నిసి పండిత్తన్నావా? నేదా?! నావల్లేటవుతాది? నానొక్కడ్నంతోటి బూఁవి ఎలాగ దున్నేత్తానని బెంబేలెత్తిపోయి కూకొమ్మీ? ఎలాగ పండెత్తాదో మూసిద్దుంగాని!! అలాగే సేత్తే ఏదైనా అవుతాది. సరసకూడా సంగంల సేరిందిరా! అదిప్పుడు ఆడంగులికి లీడు! నువ్వూ సేర్రా! నీలాటి కస్టపడినోడే సంగంల వుండాలి. సోఁవరిపోతుగాలవల్ల సొల్లు కవుర్లేగానీ ఏ.రేనాబం ఉండదు. పట్నంనుండి ఎల్లుండి రాత్రికి సంగపోల్లొత్తారు. ఆలు సెప్పింది ఇను. ఇస్టపడితే సేరు." అన్నాడు.

పట్నంనుండి ఎవులొస్తారో; ఆళ్ళెలాగుంటారోనని ఒక ఘడియ ఆలోచించేడు. మళ్ళీ వాడి కళ్ళకు పాపినాయుడి కోడలు కనిపించింది! వొళ్ళు నగ్నంగా .... గుండెలు ఎత్తుగా .... నాభి లోతుగా .... తొడలు బలంగా ....! కరంటుగాడు మెలితిరిగిపోయేడు. బద్ధకంగా వొళ్ళు విరిచేడు.

"ఏటిది?" అని ప్రశ్నించుకుంటే ఏమిటీ తెలియలేదు. "ఎందుకింత దివిగా ఉన్నాది?" అనుకుంటే ఏటీ కనిపించలేదు.

"సీ....!" అని చీదరించుకున్నాడు.

"కనిగినోలట! మొగుడు సాలక మాఁవతోటి తొంగుంటంది. ఇంకా సాలక నాను కావలిసొచ్చింది. ఊరంతా ఊసేత్తన్నారు! సిగ్గు నేదుగావాల.... సీ...." అని అసహ్యించుకున్నాడు.

అప్పుడు జ్ఞాపకంలో పడ్డది పొట్టిసరస!

పొట్టిగా బలంగా నల్లగా నున్నగా, పొంగిన బుగ్గల్తో చిన్న నుదురుతో చిలిపికళ్ళతో చలాకీగానున్న సరసని ఊహించుకొని "సానా బాగుంటాది సరస" అనుకున్నాడు. మళ్ళీ పాపినాయుడి కోడలితో సరసని నిలబెట్టి తేడా చూస్తూ

"కూడు లేపోతేవేం? కూల్చేసుకుంటేనేం? ఎంత నీతిగా బతుకుతుంది సరస??!" అని ఆశ్చర్యపోయేడు. అప్పుడు అలా అలోచిస్తున్న సమయంలో ఏడాదిక్రింతట జరిగిన విషయం కరంటుగాడికి గుర్తుకి వచ్చింది.

నిరుడు వేసంగి నువ్వులు నిరగపండినప్పుడు అనంతరావు కళ్ళానికి తుడుపుకని వెళ్ళింది సరస! ఉదయం పదిగంటలు దాటిపోయింది!

"పొద్దెక్కిపోయింది. ఇంటికెళ్ళి దప్పిక కాసుకోవాల." అనుకుంటూ నువ్వు చేను కుప్ప పక్కన చేటతో ఇసకనీ నువ్వుల్నీ వేరు చేస్తుంది.

అప్పుడు కళ్ళంలోకి వచ్చిన అనంతరావుకి సరస కుప్పపక్కన కూచొని కనిపించింది. కూచున్న సరసవైపు చూసిన అనంతరావు మనసులో అందంగానే వుంది అనుకున్నాడు. అనుకున్న అనంతరావు సరస దగ్గరకు వెళ్ళి ఒకసారి అటూ యిటూ చూసి ఎవరూ లేరని నిశ్చయించుకొని

"ఏఁవే? సరసా! ఏటి జేస్తన్నావు?" అని పలకరించి

"నువ్వుగింజలకోసం నువ్వింత కష్టపడాలటే! కుంచెడు నువ్వులు కొలిచి పంపిస్తాను. కొక్కానుకో!" అని కూచున్న సరస కొంగు లాగేడు.

జాకట్టులేని సరస గుండెల్ని అనంతరావు అందుకోబోయేసరికి సరస సర్రున త్రాచుపాములా లేచి బుసకొట్టింది.

"బావూ! బుగతగోరూ! నానంత నీతిమాలిందాన్ని కాను. వొదుల్తావా కేకేసి నలుగుర్నీ పిలమంటావా?" అని తీవ్రంగా అడిగింది.

అనంతరావు వదల్లేదు. పొట్టిసరస అన్నటుగానే పదిమందిని కేకేసి పిలిచి మాట నిలబెట్టుకుంది. పదిమందీ వచ్చేసరికి చేసిందిలేక సిగ్గుతో తలవంచుకున్న అనంతరావుని నిలువునా కడిగేస్తూ

"సిగ్గునేదేట్రా నీకు ముసిలి వచ్చినోడా? నీ ఇంట్లో నా అంత కూతురు ముండమోసుంది. దానికి సూపెట్టురా మొగుడ్ని." అని తుపుక్కున ఉమ్మేసి బాగుచేసిన మువ్వలు అనంతరావుమీద పోసి వెళ్ళిపోయింది.

సరస సాహసానికి అక్కడ పోగయిన పదిమందీ మనసులో ఆనందించినా ఊళ్ళో పలుకుబడీ ఇంట్లో డబ్బూ ఉన్న వ్యక్తిగాబట్టి జరిగిన ఈ అవమానానికి ఎంత క్రూరంగా ప్రతీకారం చేస్తాడేమోనని భయపడ్డారు.

నిప్పులాటి సరస....తను మంచాన బడినప్పుడు చెయ్యరాని సేవ జేసి మనిషిగా తయారుజేసి పదిమందిలో మళ్ళీ తిరిగినట్లు తన గురించి పాటుపడిన సరస .... "మావా! ఇక్కడే వుండిపోతానని" మనసు విప్పి చెబితే వెంటనే అంగీకరించలేకపోయినందుకు కరంటుగాడు తనని తానే ఎంతగానో నిందించుకున్నాడు

"నా పొట్టిసరస దగ్గిర పాపినాయుడు కోడల్లాటోల్లు నచ్చుమందైనా పనికిరారు." అని గట్టిగా అనుకుంటూనే లేచి సరస ఇంటికి వెళ్ళేడు.

తిరిగి వచ్చినప్పుడు కరంటుగాడు ఒక్కడేకాకుండా సరసతో సహా వచ్చేడు।

ఊరు ఊరంతా రాత్రికి రాత్రే జరిగిన ఈ సంఘటనను గురించి ఊసులాడుకుంది. "కరంటుగాడు పొట్టిసరసని పట్టుకెళ్ళిపోయేడని." పకపక నవ్వింది.

పొద్దున్న కరంటుగాడు పాపినాయుడి ఇంటికి వెళ్లేసరికి వరండాలో గజాల దొడ్డి వెనక పాపినాయుడు కుర్చీలో కూచున్నాడు. పక్కనే కోడలు నిల్చునివుంది. అది చూసి కరంటుగాడి గుండె గడగడలాడింది. అటు వెళ్ళకుండా చుట్టుతిరిగి పెరట్లోకి వెళ్దామని వెనుదిరిగిన కరంటు గాడ్ని పాపినాయుడు

"ఒరే కరంటూ!" అని పిల్చేడు.

కరంటు గుండె గుభేలుమంది. పాపినాయుడుకి స్నానాల గది లోని సంగతి తెలిసిపోయిందో, కాకపోతే వొప్పుకోలేదని ఏటి కల్పించి చెప్పిందో తేల్చుకోలేక నిలబడిపోయి తలవంచుకున్నాడు.

పాపినాయుడు నవ్వుతూ

"ఆడపిల్లలాగ అంత సిగ్గుపడిపోతావేట్రా? పొట్టిసరసని తెచ్చి సేవట!" అన్నాడు

కరంటుగాడి గుండెమీద గుదిబండ దిగిపోయినట్టుగా గట్టిగా నిట్టూర్చి తరవాత సిగ్గుపడి "సిత్తం బావూ!" అన్నాడు.

"మంచిదేన్రా! కానొరే. అది సంగంలో చేరిందనీ, గొప్ప తలబిరుసు గుంటదనీ తెలిసింది. జాగర్తరొరే! సంగాలు కూడెట్టవు. దాన్ని జాగర్తగా తిప్పుకో!" హెచ్చరించేడు.

"సరస సంగంలో చేరిందని నాయుడుబాబు కెలాగ తెలిసిపోయిం దేటి?" అని విపరీతంగా ఆశ్చర్యపోతూ "సిత్తం; సిత్తం." అన్నాడు చాలా వినయంగా.

వాడి వినయాన్నీ అడకువనూ చూసి సంతోషిస్తూ పాపినాయుడు "సరె పన్జూడు పో!" అన్నాడు.

కరంటుగాడు కదల్లేదు.

అది గమనించిన పాపినాయుడు "ఏట్రా! ఏటి కావాల?" అడిగేడు.

"ఏటినేదు బావూ! అదొచ్చిందిగదా! నా జీతపుగింజలిప్పిస్తే దప్పికొక్కొనుకొంటాం." అన్నాడు.

పాపినాయుడు నవ్వేసి "అదట్రా ! నీ జీతంగింజ లడగడానికి అంత సిగ్గుపడిపోతే ఎలాగ బతుకుతావురా నువ్వు ? ఇవాల లక్షోరం; రేపు ఉక్రోరం ఎల్లుండి పట్టికెల్లు."

"సిత్తం." అని కరంటుగాడు పొలంవైపు నడిచేడు. పాపినాయుడు నడుస్తున్న కరంటుగాడ్ని ఆపి "నేనొస్తా నుండారే ! పొలం చూదుంగాని." అని కరంటుగాడితో బయలుదేరేడు.

పాపినాయుడు ముందూ కరంటుగాడు వెనకా నడుస్తున్నారు. పాపినాయుడు అప్పుడన్నాడుగదా

"చూట్రా ! కరంటూ నువ్వెలాగ నాదగ్గిట పన్జేస్తున్నావుగదా ! నరసనికూడా మన పన్లోకే రమ్మను పేడతీసి పెంటేస్తాది. ఇంటిదగ్గిట సాయంగుంటాది" అని నరస సాయం కోరేడు.

"సిత్తం." అని ఆనందంతో ముందుకు నడుస్తున్న పాపినాయుడ్ని చూసేడు. పాపినాయుడు గొప్ప పుణ్యాత్ముడులాగ కనిపించేడు.

పుణ్యాత్ముడు పాపినాయుడు మళ్ళీ చెప్పడం ప్రారంభించేడు.

"చూట్రా ! కరంటూ ! నువ్వంటేనే నాకు మాచెడ్డ గురి ! నీ మంచితనం చూస్తే నాకు మాగొప్ప సరదా ! అంతేగాకుండా మంచోడ్ని కంబారిగా వుంచుకున్నానని నలుగురూ అంటే నాకు గొప్పతనం. కావాలనుకుంటే నాకు కంబార్లు దొరక్కుండాపోరు ! కో అంటే కోటిమంది." ఏటంటావు ? అన్నట్టుగా ఆగేడు.

కరంటుగాడు

"ఔను. డబ్బున్న మారాజులు. మీక్కరువేటి ? కూడుజల్లితే కాకులు కరువా ?" కాకులు కరువులేదన్నట్లు బుగతవైపు నమ్మకంగా చూసేడు.

పాపినాయుడు తిరిగి ప్రారంభించేడు.

"కానీ ! చూడ్రా కరంటూ ! ఈ మద్దిన ఈ చుట్టుపక్కలంతా కూలి సంగాల్లేచేయి. కలిగినోలూ లేనోలూ; బుగతలూ కంబార్లూ;

ఇలాగ తేడాలుతీసి నానాగందరగోళం లేవదీస్తున్నారు. మనూర్లోకూడా సంగం పెట్టేరని తెలిసింది. సరస అందులో వుందనికూడా తెలిసింది. నాకు సంగాలంటే మాచెడ్డ కోపం. ఈ సంగపోలు చెప్పిందంతా ఎంతబద్దవోఁ నీకు తెల్దురా! డబ్బునోడ్ని దగ్గరిది దొబ్బి లేనోడి కిచ్చీయాలట! పెళ్ళాన్నికూడా పెళ్ళం లేనోడికి సర్దియ్యమంటారు. ఒకరోజక్కడా ఒకరోజిక్కడా పడుకోమని చెప్పేస్తారు. ఆలిదేం పోయింది. అది ముడ్డి కాకపోతే కాశీదాకా డేకిరిమఁటారు. కష్టపడం చేతగానోళ్ళు ఈ సంగంలో చేరి వాళ్ళు చెడ్డవేఁగాకుండా ఇతర్లని చెడగొడుతున్నారు. నువ్వలాటోడివి కావనుకో! అందుకే నీకు చెప్పతున్నాను. సరసని సంగంనుండి తప్పుకోమను! నువ్వు పెళ్ళాడేవుగాబట్టి అది చెడిపోతే నేను చూడలేను." అని మడి గట్టుమీద నడుస్తూనే సంగంమీద చిన్న ఉపన్యాసం వొదిలేడు.

కరంటుగాడికి బుగత సంగం గురించి చెప్పిన మాటలు సబవుగానే వున్నాయనిపించేయి! కానీ సరస గురించి పదేపదే హెచ్చరిస్తుండడం కాస్త బాధనిపించింది. అయినా "సిత్తం" అనే అన్నాడు.

బుగతచేత ఇంకా మంచోడనిపించుకోడంకోసం ఆవేళ యింకా ఎక్కువ పనిచేసి ఇంటికి వచ్చేడు.

కరంటుగాడు పని ముగించుకొని ఇంటికి వచ్చేసరికి సరస చాలా సంతోషంగా కనబడింది.

"ఏటోలె సరసా! మాగొప్ప సర్దాగా వున్నావు?" అన్నాడు.

"ఇయాల సంగం మీటింగయింది మావాఁ! పట్నంనుఁడొచ్చిన బాబు ఎంతబాగా సెప్పేడనుకొన్నావు? నువ్వు రాలేదేఁవని సూరయ్యతాత అడిగేడు. రాత్తిరికి మల్లా మీటింగుంది రారాదా?" అని రమ్మంది.

కరంటుగాడికి బుగత చెప్పిన మాటలు ఇంకా బుర్రలో గిర్రున తిరుగుతున్నాయి. ఇందాక సరస గురించి చేసిన హెచ్చరిక కాస్త బాధ కలిగించినా, ఇప్పుడదికూడా సబవేననిపించింది. అందుచేత కరంటుగాడు చిరాకుపడ్డాడు. కోపం తెచ్చుకున్నాడు. కోపంలో "ఏటి సొప్పేదే పట్నంబాబు?" అని వెటకారంగా అడిగేడు.

సరస కరంటుగాడిలో కలిగిన మార్పు గమనించకుండా పూర్వపు ధోరణిలోనే

“ఆ బాబు సెప్పినయన్నీ సెప్పగల్నేటి? కల్లకు కాసడినట్టు మన బతుకుల గురిండి సెప్పేడు. బుగతల గురుండి సెప్పేడు. ఈ బూమ్మీదున్న పెతి ఊర్లోనూ బుగతలున్నారట! రెక్కాలు ముక్కాల్జేసు కొని బతుకుతున్న మన్లాటి కూలోలూ, కంబార్లూ ఉన్నారట! కూలోల కంచంలో కూడు కలిగినోలు లాగేసుకోని; అలు సెఁవట రగతంతోటి సుకాల అనబగిత్తన్నారట! ఆ బాబు అలా జరక్కూడదని సొప్పేడు. నాక్కూడా నిజవేఁననిపించింది. అప్పుడా బాబు సెప్పేడుగదా కోటి కొక్కలయిన బుగతల డబ్బూ బూఁవులూ లాగేసుకోని మనందరఁవూ సమానంగా పంచీసుకుంటే ఈ బుగతా కంబారీ తేడా వుండదన్నాడు. కష్టం సేసినోడే కడుపునిండా తినాలన్నాడు. దానికోసం కూలోలంతా ఒకటి కావాలన్నాడు.” సరస చెప్పుకుపోతుంది.

కరంటుగాడి కోపం తారాస్థాయికి చేరిపోయింది. మరి విన్లేక పోయేడు బుగత పాపినాయుడు ఏటి చెప్పేదో సరస సఁగ్గా అదే చెప్ప డంతో సగంలో ఆపేసి

“సాల్లేయే! సెప్పొచ్చేవు బోడి సంగం కవుర్లు! కలిగినోలు లేనోల సెవటా రగతం తాగేత్తన్నరా?! ఎంతబద్దవేఁ నంజికూతరా?! పాపినాయుడు బుగత సెప్పిందే నిజంనాగ కాపడతంది. సూడిమీ! పనికిమాలినోల్లూ, పనిసెయ్యేడం సేతకానోలూ సేరయినా వొల్లొంగన్నా కొడుకులూ సంగాలంటారే! పచ్చగుంటే కంటోన కారం పోస్సికున్న కవుర్లుగానీ ఎవుడిసొమ్ము దొబ్బుతారే? ఇయాల సొమ్మొంది ఇచ్చి మంటారు; రేపు నీకు పెల్లఁవుంది అల్లాడికి నేదు: ఆడి కిచ్చీమంటారు. ఇచ్చేత్తావేఁటి? ఇలాపింటి సంగాల్లో సేరక గుడిసిలో కలోగెంజో కలిగింది తాగి పడుండు.” అని పడుండమన్నాడు.

సరసకు వొళ్ళు మండిపోయింది. కరంటుగాడి మాటలకు కుత కుత లాడిపోయింది.

"మడిసివైతే ఉన్నావు మద్దిమానంత! ఏల? ఇంతిపిసర ఆలోసనన్నేదు! నీ బుగత సెప్పిందే విజింనాగ కాపడిందిగానీ అదెందు కలాగ సెప్పేడో ఆరోసన సేసేవా? ఆడి పొలంలోన అడి కళ్ళంలోన ఆడింటిలోన సెంవటలు కక్కితే ఆడు కుక్కని దువ్వినట్టు దువ్వి, "దూ! దూ!" అని పిలిసి కూడెయ్యకుండా గెంజోస్తే తాగీసి తోకా డించడవేంగానీ; ఆడెందుకలాగ దూదూ! అంటన్నాడో గెంజోసి ఏటి వాడేసుకొంటన్నాడో తెలుసుకోవద్దా? సంగం బాబులు పెల్లాల్ని సర్ది మంటారా? నీకు నోరొలాగాడింది? పాపిపాయుడి బుగత కూసేడని నువ్వుకూడా తప్పుకూతలు కూస్తావా? ఆడు ఆ పాపినాయుడికి ఏ సంగం బాబులు సర్దితే కోడల్ని...."

సరస మాట నోటినుండి పూర్తిగా రాకుండానే పటపటమని శబ్దంచేస్తూ గుడిసె ముందల రాట విరిగిపోయింది. పాక సగానికి వాలి పోయింది.

"ఓలమ్మో! పాక పడిపోతందిరోర్నాయినా!" అని సరస పెరట్లోంకి పరిగెత్తబోయింది.

ఆశ్చర్యంగా పడిపోతున్న పాకవైపు చూస్తున్న కరంటుగాడు రాట విరిగి పాక ఒక పక్కమాత్రమే ఒరిగి అలా వుండిపోవడం చూసి పరిగెత్తబోయిన సరసని పట్టుకొని

"బియ్యం నేదునేయే! రాటిరిగిందిగానీ పాకంతా పడిపోదు." అని ఆపేడు.

సరస సగానికి ఒరిగి వుండిపోయిన గుడిసెని చూస్తూ

"వానొస్తే వొడవొడ! గాలొస్తే గడగడ! అన్నట్టిగున్నాది. మానంత మడిసి వున్నవు. గుడిసెకి రెండు రాటల్తెచ్చి పాతనేవా? బుగత పనంటే బుజాలు గజాల్లాగ పొంగించి సేత్తావు. ఇంటిపనిమట్టుగ నొంటికి పట్టించుకోవు. ఇలాగే వుండిపోతావాం? పిల్లాపిచ్చికా పుడితే పడిపోయిన గుడిసెలో నెలాగుండడం?" అంది విష్టూరంగా.

"మొన్నె పసివిలపాలకోసం తెచ్చినయి బుగత కళ్ళంలో తోల్లన్ని కర్రలున్నాయే ! ఒక రాటతెచ్చి పాత్తే సరిపోద్ది." అన్నాడు సమాధానంగా.

"పాత్తే సరిపోతాది ! పాతడఁవేనేదుగావి." సరస మూతివి మూడువిరుపులు విరిచింది.

కరంటుగాడికి పౌరుషం వచ్చింది. "సూత్తావుగదా ! ఇప్పుడే బయలెల్లి బుగత కళ్ళఁనుండి రాట తెత్తాను. ఎంత రాత్రిరయినా పాక బాగుసెయ్యంది నీపక్కఁల పడుకుంటే వొట్టు." అని బుగత కళ్ళంవైపు బయల్దేరేడు.

వెళ్తున్న కరంటుగాడికి విపిపించినట్టుగా సరస "సాల్లే సెలాకు!" అని సరదాగా నవ్వుతుంది.

సందేల ! చిన్న మసక వెలుతుర్లో కళ్ళందగ్గర కెళ్ళాడు. కళ్ళం లోని సాల్లో పశువులు గడ్డి కొరుకుతున్న శబ్దం బైటకు వినిపిస్తుంది. సాలటుకుమీద పాపినాయుడి కొడుకు పేద దొంగలాడ్దావికి వచ్చిన బారికి అప్పిగాడి రెండో పెళ్ళాన్ని పట్టుకొని కాళ్ళు పిసికించుకుంటున్నాడు. గడ్డికుప్పల పక్కఁగా ఆజిరి వేయబడ్డ కర్రల దగ్గరకి గవిని తీసుకొని కరంటుగాడు వెళ్ళేడు. గవిని తీసిన చప్పుడువిని పాపినాయుడి కొడుకు గాభరాగా కాళ్ళు పట్టించుకోడం మానేసి తొంగిచూసేడు.

కరంటుగాడు ఇదేమీ గమనించకుండా తిన్నగా కర్రల దగ్గరకు వెళ్ళి ఆజిరిలోనుండి ఒక రాట బైటకు లాగేడు. సదువుగా విలబెట్టి భుజాని కెత్తుకున్నాడు !

అటుకుమీదనుండి ఇదంతా చూస్తున్న పాపినాయుడి కొడుకు గబ గబా కిందకి దిగి

"ఒరోరె ! దొంగనంజికొడకా ! ఎన్నాలాయి యిలాగ మా సంసారం పెఁగేస్తన్నావు. నువ్వేదో మంచోడివని మా బాబు నమ్మి నీకు తోడిపెత్తనం యిస్తే నువ్వెఁగబెడతంది ఇలాగన్నమాట ?!

వుంచక్కడ తన్నగబ్బ !" అని తిట్టి కరంటుగాడి భుజంమీదనున్న కర్రను తిరగేస్సి ఒక గెంటు గెంటేడు. మళ్ళీ అందుకున్నాడు.

"నీ బాబు సొమ్మనుకున్నావురా ! పద మా అయ్య దగ్గిరికి. నీ సంగతి తేలుస్తాను." అని మరొక్కగెంటు గెంటేడు.

కరంటుగాడు దిమ్మెరపోయేడు. ఏదో చెప్పడానికి ప్రయత్నించేడు. కానీ పాపినాయుడు కొడుకు అవకాశాన్నివ్వకుండా

"పదమంటే అలాగ ముంగిపోతులాగ సూస్తావేట్రా ! పదపద ! అయ్యతోటి చెప్పింతరవాత చమ్డాలూడగొట్టి చర్మం వొలిపిస్తాను. పదరా కంబారి నంజికొడకా !" అని మెడలో తువ్వాలువేసి యింటికి నడిపించేడు.

కొడుకు వేస్తున్న కేకలు కోడలచేత కాళ్ళు పట్టించుకుంటున్న పాపినాయుడికి వినిపించేయి ! వెంటనే

"ఏటి పిల్లా ? బాబు కేకల్లాగ ఇనిపిస్తన్నాయి ! ఎవుల్తోటో చూసిరమ్మ !" అన్నాడు.

కోడలు చూసింది. చూసివెళ్ళి "కరంటుగాడితోటి" అని చెప్పింది. కరంటుగాడితోటనేసరికి పాపినాయుడు కాస్త గాభరాపడ్డాడు. గబగబా మునోకట్లోనికి వచ్చి ఇద్దర్నీ విడదీసేడు !

"ఏట్రా ? ఏటిది ? !" అని కొడుకువైపు కోపంగా చూసేడు. కొడుకుకూడా కోపంగానే

"ఏటో ఆడ్నే అడుగు !" అడగమన్నాడు.

"ఏట్రా ! కరంటూ ! ఏమైంది ?"

కరంటుగాడు తల వంచీసుకున్నాడు. ఒక రాటకర్రకి ఇంత గందరగోళం జరుగుతుందని వాడు కలలోకూడా అనుకోలేదు. వలుగురికీ తెలుస్తుందేమోనని సిగ్గుపడిపోయేడు. కానీ పాపినాయుడు వదలకుండా

"చెప్పురా ! చెప్పావెసె !" అని చెప్పమనీసరికి

“ఏట్లేదు బావూ! నా గుడిసిముందల రాట విరిగిపోయి పటపటమని పక్కకొరిగిపోదాది. గబుక్కున రాటవుసరం పడింది. మన కల్లంలో ఆజిరిలోది ఒక రాట తీసేను. ఈ బావు మూడు గెంటులు గెంటీసి నానా అల్లరీ చేస్తున్నారు.” అని చెప్పేడు.

పాపినాయుడు ఇంతేగదా! అన్నట్టుగా నవ్వేడు. కోపంగా చూస్తున్న కొడుక్కి కన్నుమీటికి

“ఓసీపాటి ముండభాగ్యానికే ఇంత అల్లరెందుకురా? నీకేటి తెల్దు. మనదగ్గిర పాలేరు పని జేస్తున్నప్పుడు మనవుసర మొకటీ ఆడవుసర మొకటీ కాదు. ఆడి పాక పడిపోతే మన పాక పడిపోయి నట్టిగే! అందులోకీ కరంటుగాడు అందర్లాటివాడు కాడు. ఆడ్నిలాగ అల్లరి పెట్టడం ఏం బాగులేదు. నువ్వెళ్ళు!” అని కొడుకుని కోప్పడి వెళ్ళమన్నాడు. తరువాత కరంటుగాడితో

“ఒరే! కరంటూ రాట కర్ర పట్టుకెళ్ళడానికి రాజుగారి అనుమతి కావాలా!! ఆడు గుంటడు. ఆడికేటి తెల్దు. ఒక రాటకాడు. నాలుగు పట్టుకెళ్ళి పాక బాగుచేసుకో! నువ్వు మరేటీ బాద పడకు? కష్టం పడినోడు కర్రముక్క పట్టుకెళ్ళడానికి ఊరడా! తీసికెళ్ళు! తీసికెళ్ళు!” అని తొందర చేసేడు.

కరంటుగాడు కారుమబ్బులు కమ్మినట్టయిపోయి గాలీవానలో పిడుగులు పడతాయని భయపడ్డ పరిస్థితి పాపినాయుడు తీర్పుతో మంచు లాగ విడిపోవడంతో గొప్పగా సంతోషించేడు. “బుగత సానా మంచో డ”నుకున్నాడు. ఇంటిదగ్గర రాట పాతిందగ్గర సరసతో సంగతంతా చెప్పి బుగతని పొగిడేడు.

సరస నసేమిరా ఒప్పుకోక ఖండించేసింది.

“నీ అమాయకం గానీ పులికి మేకపిల్లమీద దయా మావా! నిన్ను కంబారిగా పట్టడానికి ఎంతమంది బుగతలు వలెయ్యనేదు. చివరికి పాపినాయుడి పట్టుకి దొరికిపోనావు. నలుగురు మనుసుల పన్జేసిన నిన్ను రాట కర్ర ముక్కకోసం వొదిలేత్తాడా? పిల్లపులికి తెలవొప్పయినా

ముసిలిపులికి తెల్లమనుకున్నావా ?! అంత బేగి నిన్నొదల్డు! నువ్వొ దులుపుకోనేవు. మూడొందలరూపాయి లప్పు పాయిదాతోటి నువ్వెప్పుడు తీరుత్తావు. అదెప్పు డొదుల్తాది ఏడాదేడాదికీ పాపం పెరిగినట్టు పెరిగి పోద్ది" అంది

కరంటుగాడు సరస మాటల్ని నమ్మకుండా

"ఉపకారానికి త్తే పాయిదాకని సెపతావేటే! బుగత నాదగ్గిర పాయిదా పుచ్చుకుంటాడా?" అన్నాడు.

"పుచ్చుకోడా?" ఎదురుప్రశ్న వేసింది సరస.

"నీతోటి తగువెందుకునేయే! ఎల్లుండి శనోరం దాన్నిం, ఇత్తా న్నాడుగదా! అప్పుడు తెలిపోద్ది." అవి అప్పటికి తేల్చేసేడు!

శనివారంనాడు బుగతకూడా తేల్చేసేడు. నూటికి రెండు పుట్లు పాయిదా లెక్కన మూడువందలకీ ఆరుపుట్లు ధాన్యం కొట్టేసి మిగతా జీతం తేల్చేసేడు ఆ మిగతా జీతంలో అందాక పట్టుకెళ్ళమని పందుం గింజలిచ్చేడు.

కరంటుగాడి కళ్ళకు కమ్మిన మాయపొరలు కరిగిపోయేయి. పాపినాయుడి పూర్తి స్వరూపం కనిపించేసరికి కసిగా

"తడిగుడ్డతోటి పీకలు కోస్సిన రకం! సాలు కట్టంలో పాయిదా పోతే గెంజి కాసుకోడానిక్కూడా గింజలు సాలవే! సరస సెప్పిందే నిజం. సరస నాకంటా సాలా తెలివైంది."

తెలివైందని తేల్చుకున్న తరువాత కరంటుగాడి సంగంల చేరి పోయేడు. సంగంలో కరంటుగాడు చేరినందుకు సరసతోపాటు చాలా మంది సంతోషించేరు.

రోజులూ వారాలూ నెలలూ దొర్లిపోయేయి. సీతకాలంపోయి వేసీకాలం; వేసీకాలంపోయి వర్షాకాలం వచ్చేసింది

ఆవేళ పల్లె పల్లెంతా ఉడికిపోతుంది. పాపినాయుడితోపాటు బుగతల మనసులన్నీ కుతకుతలాడిపోతున్నాయి! కళ్ళు క్రోధాన్ని కక్కుతున్నాయి! వొళ్ళు మంటల్ని మండిస్తుంది!

బుగతలంతా కలిసి మూడుసార్లు మీటింగు పెట్టేరు. అయినా సాలల్లో పశువులు కట్టుకొయ్యనుండి విడిపడలేదు! మేతల్లేక అరుస్తున్న అరుపులు విని బుగతలు భుగభుగ మండేరు!

ఇళ్ళల్లో నీటిచుక్క లేదు. బుగతల ఇంట్లో పిల్లలూ ఆడాళ్ళూ స్నానాల్లేక వంటల్లేక మలమల మాడేరు!

పొలాల్లో పన్లు ఎక్కడివక్కడ అలాగే పడివుండడంతో పల్లెంతా చలనంలేకుండా నిశ్శబ్దంగా గంభీరంగా కనిపిస్తుంది!

కరంటుగాడు కంబార్ల సమ్మెకి నాయకత్వం వహించేడు! సరస ఆడకూలీల్ని ఉడుపులకు పోకుండా ఆపి సమ్మెను ముందుకు నడిపిస్తుంది!

సింగన్నపాలెం బుగతలంతా నాలుగోసారి మీటింగు పెట్టుకున్నారు. సింగన్నపాలేనికి ఆరుమైళ్ళ దూరంలో వున్న ఏజెన్సీ గ్రామంలో దోపిడీ జరిగిందని తెలియడంతో వాళ్ళింకా విపరీతంగా భయపడిపోయేరు. అయినా బైటకు గంభీరంగానే కనిపించడానికి ప్రయత్నిస్తూ కరంటుగాణ్ణి రమ్మని కబురుపెట్టేరు! కబురుపెడితే వచ్చిన కరంటుగాడితో పాపినాయుడు నవ్వుతూ

"చూడ్రా! కరంటూ! కంబార్లంతా చాలా కష్టపడతన్నారు. మాకు తెలుసును. మీ పెళ్ళాలకీ పిల్లలకీ తక్కువ జీతాల్తో ఈ కరువుల్లో అన్నం కాదుగదా గెంజిపొయ్యడంకూడా గొప్ప కష్టవేఁ! ఆ సంగతీ మాకు తెలుసు. అదేకాదురా! ఉడుపులోళ్ళూ గొప్పోలవాళ్ళూ ఒకలేటికే వ్యవసాయ కూలీలంతన్నూ పప్పుంటే ఉప్పులేని సంసారాలు కాదు! ఉప్పూ పప్పూ లేని సంసారాలు ఈడుస్తున్నారు! అదికూడా తెలుసును. మరందుచేత మేవంతా కలిసి ఆలోచించేం. మీరడిగిందాంట్లో సగవు గమనించేం! అలాగే తీసుకొని పన్లోకి రండ్రా!" అన్నాడు.

అలా అవిధంగా అంత పెద్దవిషయం అంత సులువుగా తేలిపోయినందుకు కరంటుగాడు ఆశ్చర్యపోయేడు! జీతాలు కొలిచినప్పుడు మానిక మార్చమంటే కొరడా పుచ్చుకున్న బుగతలు అడిగినంత పెంచడం

వాడికి గొప్ప విచిత్రమనిపించింది. బుగతల దగ్గర్నుండి తిరిగివచ్చి తోటి కంబార్లతోనూ కూలీలతోనూ జరిగింది చెప్పేడు.

విని అంతా సంతోషించేరు। ఆ సంతోషంలో అంతవరకూ సంగంలో చేరనివాళ్ళుకూడా చేరిపోయేరు।

సంగంలో కూలీలంతా చేరడం చూసిన బుగతలంతా బుసకొట్టేరు. కరంటుగాడ్ని కాలితో రాసీసి నల్లిలా నలిపేయమన్నారు.

పాపినాయుడు పాములా పడగవిప్పేడు.

వర్షాలు జోయిగా కురుస్తున్నాయి. ఆకాశం బద్దలయినట్టు కుండ పోతగా కురుస్తున్నాయి. చెరువులు తీసిపారినట్టు ప్రతిరోజూ కురుస్తున్నాయి।

పల్లెంతా ఉడుపుల్లోపడి తీరికలేకుండా వుంది. సరసకు తొమ్మిది నెలలు నిండడంచేత పన్లోకి పోలేదు. కరంటుగాడు మాత్రం పగలంతా పాపినాయుడి పొలంలో పనిచేసి చాలా పొద్దుపోయిన తరువాత ఇంటికి వస్తున్నాడు. మళ్ళీ కోడికూతతో లేచి వెళ్ళిపోతున్నాడు।

సరస కరంటుగాడితో మాటాడ్డానికి మూడు రోజులనుండి ప్రయత్నిస్తుంది. కానీ కిట్టలేదు. రాత్రి అన్నం తినగానే అలాగే పడుకొని టోకుర్లు తీసేస్తున్నాడు. గిన్నెలు కడుక్కొచ్చివచ్చి చూసేసరికి సగం నిద్రలో వుంటున్నాడు. మళ్ళీ ఉదయం కోడికూతతో లేచి హడావుడిగా వెళిపోతున్నాడు. అంచేత సరసకి కరంటుగాడితో మాటాడ్డానికి అవకాశం లేకుండా పోయింది.

సరసకు వొళ్ళు పొంగిపోయి వారంరోజులైంది. చలిమిరిగా వున్న నేలమీన పడుకోవడంచేత అలా పొంగిందని భోగట్టాచేస్తే తెలిసింది। అంతేగాకుండా పురుడుకూడా రేపో నేడో వచ్చినట్టుగా వుంది. అందుచేత మంచం సంపాదించాలనుకుంది.

గుడిసెలోమాత్రం కోడు విరిగిపోయి నులక తెగిపోయిన పాత మంచం ఒకటుంది. దాన్ని తీసికెళ్ళి వండ్రంగి వెంకయ్యకి చూపించింది. అతడు దాన్ని చూసి కర్ర తెస్తే కోడు తయారుచేసి అమురుస్తానని

చెప్పేడు! ఆ విషయమే కరంటుగాడితో చెబుదామని ప్రయత్నించి మూడురోజులైపోయినా చెప్పడానికి అవకాశం చిక్కకుండాపోయింది.

నాలుగోరోజు మాత్రం తప్పకుండా చెప్పడానికి నిశ్చయించుకుంది.

రోజూలాగే ఆ రోజుకూడా చాలా పొద్దుపోయిన తరువాత కరంటుగాడు ఇంటికి వచ్చేడు. సరస అన్నంపెట్టి "మావాఁ!" అని పిల్చింది.

కరంటుగాడు "ఏవేఁ!" అని పలికేడు.

"మంచం బాగుసెయ్యాల! నేల తొంగుంటే సలివిఁరికి వొళ్ళు పొంగిపోయి మొకం గాదరించిపోనాది. వుట్టి మడిసివి కాదుగదా! ఇయాలో రేపో నాగుంది."

కరంటుగాడు కళ్ళెత్తి సరసని చూసేడు. మనిషి పాలిపోయి నట్టుగా కనిపిస్తుంది. పాదాల పొంగులు స్పష్టంగా అవుపిస్తున్నాయి

"దమ్ముల్లోన పడిపోయి నిన్ను సూడ్డానికి తీర్లేదే?! మడిసివేటి అలాగయిపోనావు!" అన్నాడు ప్రేమగా!

"ఏలైపోనేదుగానీ ఎంకియదద్ద కోడుకి కర్రతెస్తే మంచం అఁవురుస్తానన్నాడు. మూరిడు కర్రముక్క సాన! తెచ్చిపడిద్దూ! బాగుసేయించి మలక నేయిస్తాను!" అంది సరస.

"తెల్లారి తెత్తానే!" అన్నాడు కరంటుగాడు.

కోడి కూసింది. రాత్రంతా కురిసిన వర్షం కోడికూతకు గంట ముందుగా వదిలీసింది. ఆకాశంమీద చుక్కలు చక్కగా వెలుగుతున్నాయి. పొలాల గట్లమీదనుండి పొంగి పొరలుతున్న నీరు గలగల మని శబ్దం చేస్తుంది. కప్పల అరుపులూ కోళ్ళ కూతలూ కలగలిసిపోయి వింతగా శబ్దం వినిపిస్తుంది. కంబార్లు పశువులకు కుడితిలు పెట్టి నాగళ్ళు పూస్తూ హడావుడిగా వున్నారు.

కరంటుగాడు పాపినాయుడి సాలటుకుమీద ఇండికర్రముక్క తీసేసి వండ్రంగి వెంకయ్య ఇంటిముందున్న సాలలో పడేసి ఆ సంగతి సరసకి చెప్పేసి ఏరుతోలుకొని పొలానికి వెళ్ళిపోయేడు!

బారెడి పొద్దెక్కింది. దున్నుతున్న పోతులు ముండెండ దెబ్బకి సొంగలు కక్కుతున్నాయి. కరంటుగాడు దున్నుతున్న నాగలి వదిలి చుట్టబెంటునున్న అగ్గికి ముట్టించి సల్లందికావిడి వస్తుందేమోనని చూసేడు. దూరంగా గబగబా వడిచివస్తున్న తోటిపాలేరు అప్పిగాడు కనిపించేడు. సల్లందికావిడితో కాకుండా చేతులూపుకుంటూ వస్తున్నాడు. కరంటుగాడు కొస్త ఆశ్చిర్యంగా

"సల్లంది గెంజితేకండా సేతులూపుకోని వొచ్చే స్తన్నాడు సెప్మా ? ?" అని ఆలోచించేడు.

ఆలోచిస్తూ నిల్చున్న కరంటుగాడి దగ్గిరికి అప్పిగాడు వచ్చి

"ఒరే కరంటూ ! బుగత నిన్ను పిలమన్నాడు. సరసని బుగత గజాల దొడ్డికేసి కట్టీసేడు. తగువుకి పోలీసోలూ పెద్దమడుసులొచ్చేరు." అని చెప్పేడు.

కరంటుగాడి నెత్తిమీదే పిడుగు పడినట్టయింది. "సరస నెందు క్కట్టీసేర్రా ? పోలీసోలెందుకురా ?" అని ఆత్రంగా అడిగేడు.

"నాకేటి తెల్దు. బేగెల్లురా !" అని అప్పిగాడు వెళ్ళమని తొందర చేసేడు.

కరంటుగాడు చేతికఱ్ఱ తీసుకొని పరుగూ నడకమీద పాపినాయుడు ఇంటికి వెళ్ళేడు. అక్కడ మంచాలమీదా కుర్చీలమీదా పది పదిహేను మంది ఊరి పెద్దలు కూచున్నారు. కొంతమంది ఆడంగులూ, కుఱ్ఱాళ్ళూ చుట్టూ మూగివున్నారు. పాపినాయుడు పక్కన ఇద్దరు పోలీసులున్నారు. సరస గుమ్మానికున్న గజాలకి తువ్వాలతో కట్టబడివుంది. మునకాల కఱ్ఱపట్టుకొని వడ్రంగి వెంకయ్య పక్కన పాపినాయుడు కొడుకు నిలబడివున్నాడు.

గజాలకి కట్టబడ్డ సరసని చూసేసరికి కరంటుగాడి కళ్ళు అగ్నిని కురిసేయి ! ఉద్రేకం కట్టలుతెంచుకు ప్రవహించింది. కిందామీదా చూడ కుండా ఎవరున్నారోకూడా గమనించకుండా

"ఏ నంజికొడుకు ? ఎవుడాడు ?! నా సరసని కట్టీసీపాటి మొగోడు !" అని చేతినున్న సేపాటికర్ర నేలకు కొట్టేడు.

"ఏటి పేల్తన్నావురా ? కట్టీసింది నీనేన్రా దొంగలంజికొడుకా !" అని పాపినాయుడు కొడుకు ముందుకు వచ్చేడు.

"నువ్వయితే నవ్వురా !" అని బలంగా రెండు చేతుల్తో కర్ర పైకెత్తేడు.

మించిపోయిందని ఇద్దరు పోలీసులూ అమాంతంగా కరంటుగాడ్ని పట్టుకొని ఆపేసేరు ! పోలీసులు పట్టుకొని అపిన తరవాత పాపి నాయుడు వచ్చి ఫట్‌మని కరంటుగాడి దవడమీద కొట్టి

"గుండిలు తీస్పిన బంటువిరా నువ్వు ? దొంగతనం చేసింది చాలక తిరగబడతావన్రా ? బొక్కల్తోయించేస్తాను." గర్జించేడు.

"ఇదుగో బుగతా ! పెయ్యి తిప్పగుంచుకో ! ముసిలోడివని వూరుకున్నాను. ఎవులు దొంగలాడేరు ?" కరంటుగాడు గద్దించేడు.

"నువ్వేన్రా ! నా సాలటుకుమీద ఇరిడికర్ర నీ బాబుగారి సొమ్ము లాగ దొబ్బుకుపోయి వెంకయ్య ఇంటికగ్గిట పడీసేవు ! నీ పెళ్ళానికి; దాని బతుక్కి పందిరికోళ్ళ మంచం కావలిసొచ్చిందిరా ?" అని కరంటు గాడి మీదకి వెళ్ళబోయేడు. వెంటనే ప్రశిడెంటు జోక్యం చేసుకుంటూ

"పాపినాయుడూ నువ్వూరుకో ! మేంవున్నాం గదా !" అని పాపి నాయుడ్ని తగ్గించి "ఏంరా కరంటూ ! సాలటుకుమీద ఇరికికర్ర నువ్వు తీసేవా ?" అని అడిగేడు.

"తీసేను." అన్నాడు కరంటుగాడు ముక్తసరిగా.

"ఎందుకు తీసేవు ?" ప్రశిడెంటు కారణం అడిగేడు.

"మంచంకోడు సేయించడంకోసం."

వెంటనే పాపినాయుడు కొడుకు వెటకారంగా

"నేల తొంగోలేదేట్రా ! నీ పెల్లం." అన్నాడు.

అంతా నవ్వేరు. కరంటుగాడి రక్తం ఉడికిపోయింది.

"నా పెల్లం నేలతొంగుంటాది. నీ పెల్లం ఎక్కడ తొంగుంటుందో సూసేవా? మీ అయ్య పక్కల....సిగ్గునేదుమల్ల....ఛూ....!" అని ఉమ్మేసేడు.

అంతా విశ్శబ్దమైపోయింది. వాతావరణం బీభత్సంగా మారిపోయింది. రక్తాలే కారతాయో, శవాలే నేలకు దొర్లుతాయో తెలియనంత భయంకరంగా పరిస్థితి మారిపోయింది. పాపినాయుడు కళ్ళు నిప్పులు కక్కుతున్నాయి. మనిషి కోపంతో ఊగిపోయి మళ్ళీ సర్దుకున్నాడు. సర్దుకొని ప్రారంభించేడు.

"ఈ లంజికొడుకు .... ఈడి పొగరు మీరంతా చూసేరు! ఈడి మాట విన్నారు. ఈడెంతకి తెగించీసి ఏటి పేలేడోకూడా విన్నారు. ఇప్పుడు అడి పెళ్ళానికి మంచం చేయించడానికి మా సాల్లోని ఇరిడికర్ర అడక్కుండా తీస్పేడు. ఏటీ ఘోరం అని పెద్దమనుషుల ముందడిగితే కొట్టడానికి తయారై నోటికొచ్చిన తిట్లన్నీ తిట్టేడు. బుర్రపట్టని మాట పేలేడు. ఇంకా ఈ లంజికొడుకు బుర్ర బద్దలవకుండా ఎలాగుందో నాకు తెలియకుండా వుంది. ఆ మహా ఇల్లాలిమీద అంత నిందేసినందుకు ఈడి బుర్ర ఇప్పుడే పగిలకపోయినా ఇంతకి రెండింతలు అనబగించి తీరతాడు. ఈ కర్ర అడక్కుండా ఇవాళ తీస్పినోడు రేపు నా యింట్లో జొరబడి నా ఇనప్పెట్టెతోపాటు నా బుర్ర బద్దలుకొట్టడన్న నమ్మకం ఏటి? మరిలాగ బుర్రలు బద్దలుకొట్టడానికి తయారై పోయినోడ్ని ఏటనకుండా పోన్లె అని వొదిలేస్తావనుకొండి; నా వొక్కడికే కాదు, ఈ వూరికేకాదు దేశానికే అపకారం జేసేస్తాడు. బుర్రని బద్దలు కొట్టినోళ్ళని వొదిలీసిన దేశం బుగ్గయిపోతాది. మరందుచేత ఈడ్ని పోలీసుల కప్పగించేస్తాము. ఇది నా ఉద్దేశం. దీనిమీద మీ తీరుపు ఎటో చెప్పండి? మీ తీరుపెలాటిదైనా నేను తలొగ్గుతాను." అని ముగించేడు.

పెద్దలంతా పాపినాయుడి ఉద్దేశ్యాన్ని సమర్థించి అదే మా తీర్పు అని ఏకగ్రీవంగా చెప్పేరు.

కరంటుగాడు సమర్థించిన పెద్దల్ని చూసేడు. గజాలకి కట్టివుంచి నరసని చూసేడు. తరువాత పాపినాయుడ్ని చూసేడు. చూసి

"ఒరే! బుగతా!! నువ్వేదో మంచోడివని నమ్మేను. నువ్వు మేకతోలు కప్పుకున్న ముసిలి పులివని అదిగో నా సరస సెప్పినా నమ్మేనుకాను. నీ ఇంట్లోనూ పొలంలోనూ ఊడిగం చేసేను. నీ మెరక బూఁవంతా పల్లంజేసేను. పల్లపు బూఁవిలోన బంగారం పండించేను. అది నీకు తెలుసును. ఈ వూరి బుగతలకికూడా తెలుసును. నీ మాట కోసం, నీ మెప్పుకోసం, కరంటుగాడు కష్టపడి పన్జేస్తున్నాడ్రా అని అనిపించుకోడంకోసం అలాగ బక్కులాగ కట్టపడ్డాను. అలాగ సేసేను.

మరి నువ్వేటి సేసేవు? నా మూడొందలప్పుకి ఆరుపుట్ల ధాన్యం పాయిదా దొబ్బి గెంజితాగడానికి నేకండా జేసేవు. నా పెల్లాన్ని కట్టేసి కొట్టి నన్ను ఈ పోలీసు బావుల కొప్పజెప్పాలని సూత్తన్నావు! నువ్వెందుకిలాగ నన్ను ముంచీడానికి సూత్తన్నావో నాకిప్పుడు తెలుస్తుంది. నాకల్లకి సొష్టంగా కాపడతంది. ఆయాల నీ కొడుకు నీ కల్లంలో రాటకర్ర తీసినప్పుడు గెంటుకుంటూ నీదగ్గిరికి తెత్తే నువ్వేటన్నావు? ఆడంత కస్టపడతన్నాడు. కర్రముక్క తియ్యడానికి అడగాలట్రా?! అని కొడుక్కి కోప్పడి కావలసినన్ని కర్రలు తీసికెల్లమన్నావు!

ఇయాల మూరిడు ఇరిడి కర్రముక్కకి ఇంతజేసి నా బతుకుల బుగ్గి పోసీడానికి సూత్తన్నావు! ఆయాల రాటకర్రకి ఆ తీరుపెలగ ఇచ్చేవో, ఈయాల మూరిడి ఇరిడి కర్రముక్కకి ఈ తీరుపెందుకిలాగ ఇచ్చేవో నాకు తెలిసిపోయింది. మా బతుకులమీద మీరు తీరుపులు సెపితే ఎలాగుంటాదో ఇప్పుడు నా కల్లకి సానా సొష్టంగా కాపడిపోయింది.

ఇయాల్టినుండీ మా బతుకులమీద మీ తీరుపులు సెల్లడానికి ఈల్లేదు.

కప్పల బతుకులమీద పాఁవులు తీరుపులు సెప్పరాదు!. మేకల బతుకులమీద పులులూ సింహాలూ తీరుపులు సెప్పడం పనికిరాదు!! ఎలకల గురించి పిల్లులు సెప్పిన తీరుపులు సెల్లకుండా సెయ్యాల! నీ

తీరుపు నీదగ్గిరే ఉంచీసుకో ! ఇదిగోటి ! ఇప్పుడే ఈపట్టానే నానెల్లి పోతన్నాను. నావిక్కడ్నుండెల్లి పోతన్నాను. దమ్ములుంటే అడ్డండి." అని గట్టిగా విదిలించికొట్టేడు అంతవరకూ కరంటుగాడ్ని పట్టివుంచిన పోలీసులు వదిలేసి వింతగా చూస్తున్నారు !

కరంటుగాడు అక్కడున్నవాళ్ళందరికీ ప్రళయకాల రుద్రుడిలాగ కనిపించేడు. ఒకొక్క అడుగూ ముందుకివేస్తూ

"ఎవుళికి ముందు పవ్వాలనుంటే ఆలే తొలిరండి ! దెబ్బకి బుక్కెడు రగతాన్ని కక్కుడురుగాని." అని తొడలుచరిచి కర్ర పైకెత్తాడు.

అక్కడున్న వాళ్ళంతా భయంతో బొమ్మల్లాగ ఎక్కడివాళ్ళక్కడే ఉండిపోయేరు. ఎవరి తలమీద ఏ క్షణాన కర్ర పడిపోతుందేమో నని ఎజవజ వణుకుతున్నారు. వొణుకుతున్నవాళ్ళను చూసి

"రారేంవిరా ! రాండి !" సవాలుగా పిలిచేడు. ఏ ఒక్కరూ అడుగు ముందుకు వెయ్యలేదు.

కరంటుగాడు సరస దగ్గరకు వెళ్ళి తువ్వాలతో కట్టిన కట్టు ఊడదీస్సి

"పదే ! ఇయాల్టినుండి బుగతల బతుకులమీదన మనం తీరుపు సెపుదుం. మన తీరుపెలాగుంటాదో ఈలకి సూపెడుదుంగాని పద !" అని సరసని తీసుకొని కష్టజీవుల తీర్పు భూమ్మీద చెల్లినట్టు చెయ్యడం కోసం వెళ్ళిపోయేడు !